ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 15 సెప్టెంబరు 2025



ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు లారీలో లోడ్ చేసిన కాయలు

ప్రణాళికాబద్ధంగా జిల్లా అభివృద్ధికి కృషి

- అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పనిచేయడం అదృష్టంగా భావిస్తా
- బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ నిశాంత్‌కుమార్



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా అన్నమయ్య జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని, అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పని చేయడం అదృష్టంగా భావిస్తానని నూతన కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కలెక్టర్ ఛాంబర్‌లో వేదపండితుల ఆశీర్వచనాల అనంతరం ఉదయం 11.30 గంటలకు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లా అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లు, డీఆర్‌వో, ఆర్డీవో, జిల్లా అధికారుల బృందం, ప్రజాప్రతినిధుల బృందం, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో అభివృద్ధికి అవకాశం ఉన్న అంశాలపై దృష్టి సారించి జిల్లా ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రాయచోటి, రాజంపేటలలో పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, రహదారులు, పునరుత్పాదక ఇంధన వనరులు ఇరిగేషన్ ప్రాజెక్టులపై దృష్టి సారిస్తానన్నారు. జిల్లాలో మదనపల్లి ప్రాంతంలో హార్టికల్చర్‌ను ప్రోత్సహించి రైతులకు ఆదాయం పెరిగేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు చల్లా కళ్యాణి, భావన, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఏవో నాగభూషణంలు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలువురు జిల్లా అధికారులు, పాత్రికేయులు, ప్రముఖులు తదితరులు పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలతో కలెక్టర్‌కు స్వాగతం పలికి తమ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

శాఖల సమన్వయంతో లక్ష్యాలను సాధించాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ధేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ఆదివారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ వంటి సంక్షేమ పథకాల అమలులో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈనెల 15, 16వ తేదీల్లో అమరావతిలో జరగబోయే కలెక్టర్ల సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాకు సంబంధించి అతి ముఖ్యమైన విషయాలను వివిధ శాఖల జిల్లా అధికారులను పలు ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన సమస్యలను ముందే గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలపై ప్రణాళికలు రూపొందించుకుని జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు భావన, చల్లా కళ్యాణి, డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


దోస రైతుకు జాక్‌పాట్

- భారీగా పెరిగిన ధరలు
- కేజీ రూ.15 నుంచి రూ.45కు చేరిన వైనం
- ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ డిమాండ్
- తగ్గిన సాగుతో ఆకాశాన్నంటిన ధరలు
- ఆనందంలో దోస రైతులు



ములకలచెరువు మండలం బురుజుపల్లె సమీపంలో సాగైన దోస పంట

ములకలచెరువు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దోస రైతులకు జాక్‌పాట్ తగిలింది. ఉత్తరాది రాష్ట్రాల్లో దోసకు డిమాండ్ భారీగా పెరగడంతో ధరలు ఆకాశాన్నంటాయి. పది రోజుల క్రితం వరకు కేజీ రూ.15 వరకు మాత్రమే పలికిన ధర నేడు ఏకంగా రూ.45కు చేరింది. మునుపెన్నడూ లేని విధంగా ధరలు పెరగడంతో దోస రైతులు ఆనందంలో ఉన్నారు. ధరలు ఇలాగే కొనసాగితే రైతుల పంట పండినట్టే. ఉత్తరాదిన నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. మరో పది రోజుల్లో ఉత్తరాది రాష్ట్రాల్లో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో ఇక్కడి దోసకు డిమాండ్ భారీగా పెరిగింది. దోస సాగు కూడా భారీగా తగ్గడంతో ధరలు పెరగడానికి కారణమైంది.



తోటలో కుప్పలుగా వేసిన కాయలు

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో దోసను విస్తారంగా సాగు చేస్తారు. సహజంగా నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో ఈ ప్రాంతంలో దోస పంట వందల ఎకరాల్లో సాగు చేస్తారు. సాగు చేసిన మూడు నెలలకు వేసవిలో దిగుబడి వస్తుంది. ఆ సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా దోస పంట సాగవుతుంది. ఈ క్రమంలో అక్టోబరులో జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా డిమాండ్ ఉంటుందని ఇక్కడి రైతులు దోస పంటను జూలై నెలలో కూడా సాగు చేస్తుంటారు. సరిగ్గా నవరాత్రి ఉత్సవాలకు ముందు దిగుబడి వచ్చేలా దోసను సాగు చేస్తారు. దీంతో ఈసారి కూడా ఈ ప్రాంతంలో జూలై నెలలో దోస పంటను సాగు చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో సుమారు వంద ఎకరాల వరకు దోసను సాగు చేశారు. రైతులు సాగు చేసిన దోస ప్రస్తుతం దిగుబడి వస్తోంది. ఎకరా దోస సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్ష వరకు ఖర్చు అవుతోంది.

దోస రైతుల పంట పండుతోంది

ప్రస్తుతం దోస సాగు చేసిన రైతు పంట పండుతోంది. పది రోజుల క్రితం వరకు కేజీ రూ.10 నుంచి రూ.15 వరకు పలికాయి. ప్రస్తుతం దోస ధరలు భారీగా పెరిగిపోయాయి. కేజీ ధర రూ.45కు చేరింది. నవరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా జరిగే ఉత్తరాది రాష్ట్రాల్లో అక్కడి రైతులు ఈ సమయంలో దోసను సాగు చేయరు. అక్కడి వాతావరణం ప్రస్తుతం పంట సాగుకు అనుకూలించకపోవడంతో ఇక్కడి దోసకు డిమాండ్ భారీగా పెరిగిపోయింది. ప్రస్తుతం ఇక్కడి నుంచి దోసకాయలు గుజరాత్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ధరలు ఇలాగే కొనసాగితే రైతులకు ఆదాయం బాగా వస్తుంది.

సీజన్‌లో భారీగా పడిపోయిన ధరలు

ఈ ప్రాంతంలో దోస సాగయ్యే నవంబరు, డిసెంబరు, జనవరి నెలలను రైతులు దోస సీజన్‌గా భావిస్తారు. ఈ మూడు నెలల్లో సాగు చేసిన దోస వేసవిలో దిగుబడి వస్తాయి. ఈసారి సీజన్‌లో దోస సాగు చేసిన రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. దోస ధరలు పాతాళానికి చేరుకోవడంతో రైతన్నలకు కన్నీరే మిగిలింది. అప్పట్లో దోస ధరలు కుప్పకూలాయి. ధరలు పతనమై కేజీ రూ.5 నుంచి రూ.10 వరకు మాత్రమే పలికాయి. దోస కాయలు ఎగుమతి చేస్తున్న రాష్ట్రాల్లో కూడా దోస పంట అధికంగా సాగు కావడంతో ధరలు పాతాళానికి చేరాయి. దీంతో మన ప్రాంతంలో పండిన దోస పంటకు డిమాండ్ భారీగా తగ్గిపోయింది. దీంతో పంటకు పెట్టిన పెట్టుబడులు సైతం రాకపోవడంతో రైతులు కుమిలిపోయారు. దీనికి తోడు వైరస్ కూడా సోకడంతో కాయలు సైజు రాక తీవ్ర నష్టం కలిగింది. ఇప్పుడు ధరలు బాగా ఉన్నా కొందరు రైతులే దోస సాగు చేశారు. నష్టాల కారణంగా అత్యధిక రైతులు సాగుకు దూరంగా ఉన్నారు.

నవరాత్రి ఉత్సవాలతో దోస ధరలు పెరిగాయి



ఉత్తరాది రాష్ట్రాల్లో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దోసకాయల ధరలు బాగా పెరిగాయి. నాలుగు ఎకరాల్లో దోస పంట సాగు చేశాను. జూలై నెలలో సాగు చేసిన పంట ప్రస్తుతం దిగుబడి వస్తోంది. నాలుగు ఎకరాలకు 40 నుంచి 50 టన్నుల దిగుబడి రావచ్చు. కాయలు మొదటి కటింగ్ చేయించాను. కేజీ రూ.45తో వ్యాపారస్థులే తోట దగ్గరకు వచ్చి కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా ధర ఉంది. ఇంతగా ధర పలుకుతుందని అనుకోలేదు. చాలా ఆనందంగా ఉంది.

- సోమశేఖర్‌రెడ్డి, దోస రైతు, బురుజుపల్లె

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి(నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైసీపీ కోటలో 22 ఏళ్ల తర్వాత కూటమి పాగా

- ముక్కా సమక్షంలో 60 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక




ముక్కా రూపానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన 60 వైసీపీ కుటుంబాలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యవరం గ్రామ పంచాయతీ కేంద్రంలో వైసీపీకి చెందిన 60 కుటుంబాల వారు ఆదివారం టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చియ్యవరం గ్రామ పంచాయతీ కేంద్రం వైసీపీకి కంచుకోటగా ఉండేది. 22 ఏళ్ల తర్వాత అక్కడ టీడీపీ పాగా వేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారని తెలిపారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర వాటికి ఇప్పటికే రూ.90 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు విషయంలో రాష్ట్రంలోనే మంత్రి నారా లోకేశ్ తర్వాత రైల్వేకోడూరు రెండో స్థానంలో ఉందని గుర్తు చేశారు. చియ్యవరంలో రూ.50 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. చియ్యవరంలో గిరిజనులకు స్థలాలు ఇప్పిస్తామని తెలిపారు. నలసిద్దు నరేష్‌రెడ్డి, నలసిద్దు రవీంద్రారెడ్డి, నలసిద్దు నరసింహారెడ్డి, నలసిద్దు జగదీశ్వర్‌రెడ్డి, మద్దిన చంద్రనాయుడు, మద్దిన రామచంద్రనాయుడు, మద్దిన మల్లినాయుడు, బుద్ది లక్ష్మీకర్‌రెడ్డి, నూకా జగన్మోహన్‌రెడ్డి, మామిళ్ల కృష్ణారెడ్డి, వేమన జ్యోతి, జిలకం ఆంజనేయులుతో పాటు పలువురు టీడీపీలో చేరినట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాటూరి శ్రీనివాసులురెడ్డి, కల్లా చలపతి, తల్లం వెంకటరమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా,గిరి నాయుడు, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, మైనార్టీ నాయకులు జుబేర్, గడికోట సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా...ఉత్సాహంగా

- పోలీస్ అధికారులు.. క్రీడాకారుల నడుమ క్రికెట్
- ఉత్కంఠ పోరులో డ్రాగా ముగిసిన మ్యాచ్



టీ20 క్రికెట్ మ్యాచ్‌లో తలపడుతున్న ఇరు జట్లు



క్రీడా మైదానం వెలుపల ఆటను తిలకిస్తున్న ఏఎస్పీ, డీఎస్పీ తదితరులు

వాల్మీకిపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఉద్యోగ ఒత్తిడితో సతమతమయ్యే విషయాలను పక్కనపెట్టి ఆటవిడుపుకోసం ఓవైపు పోలీసు అధికారులు మరోవైపు క్రీడాకారులు టీ-20 క్రికెట్ మ్యాచ్‌లో పోటీపడ్డారు. వాల్మీకిపురం పట్టణ సమీపంలోని మద్రిపాడు మార్గంలో గల జీవీఎస్‌సీఎస్ క్రీడా మైదానంలో ఆదివారం టీ-20 క్రికెట్ పోటీలు నిర్వహించగా అన్నమయ్య జిల్లా పోలీస్ అధికారుల జట్టు మరోవైపు స్థానిక క్రీడాకారుల జట్టు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేపట్టిన అన్నమయ్య-11 జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 142 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేపట్టిన జీవీఎస్‌సీఎస్ జట్టు 6 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసింది. ఎంతో ఉత్కంఠగా క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ చేకూరుతుందని, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మదనపల్లె డీఎస్పీ మహేంద్ర మాట్లాడుతూ రోజంతా క్రీడా మైదానంలో గడపడం చాలా సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ వి.రాజారమేశ్, స్థానిక సీఐ రాఘవరెడ్డి, ఎస్‌ఐలు చంద్రశేఖర్, రఘురామ్, అన్వర్‌బాషా, ఏఎస్‌ఐ గోపాల్‌నాయక్, వివిధ మండలాల పోలీసులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో సండే.. సందడి

- సరదాగా పర్యాటకుల విహారం



హార్సిలీహిల్స్ సరదాగా ఫొటోలు తీసుకుంటున్న యువత

బి.కొత్తకోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో ఆదివారం పర్యాటకుల రద్దీ కనిపించింది. శని, ఆదివారాలు వరుసగా సెలవులు రావడంతో పాటు మూడురోజులుగా మారిన వాతావరణంతో కొండపై మేఘాల కదలికలు, విభిన్న వాతావరణాన్ని ఆస్వాదించేందుకు జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. గాలిబండ, పాత, కొత్త వ్యూపాయింట్లు, అటవీ ప్రాంగణంలోని పార్కులలో విహరిస్తూ ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ సరదాగా గడిపారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కాకుండా కర్నాటక నుంచి సందర్శకులు పెద్దఎత్తున తరలిరావడంతో హిల్స్ కిటకిటలాడింది. ఏపీటూరిజం, అటవీశాఖ అతిథిగృహాలతో పాటు ప్రైవేటు రెస్టారెంట్లు అతిథులతో కళకళలాడాయి.

పెద్దేరులో ఇసుక దందా..!

- రాత్రివేళ తవ్వకాలు..పగలు అమ్మకాలు
- పెద్దేరు వెంబడి ఇసుక డంపులు
- గాలివీడు, ఎన్‌పీ కుంటలకు తరలింపు
- సీజ్ చేసిన ఇసుక కూడా తరలింపు?



దిగువపల్లె వద్ద ఇసుక తరలింపును అడ్డుకుంటున్న రైతులు

పెద్దమండ్యం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలం దిగువపల్లె సమీపంలోని పెద్దేరులో ఇసుక దందా యథేచ్ఛగా నడుస్తోంది. తంబళ్లపల్లె మండలంలో మొదలయ్యే పెద్దేరు.. తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దమండ్యం మండలాల గుండా వెళ్తోంది. నది వెంబడి ఇసుక తిన్నెలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా పెద్దమండ్యం మండలంలోని మందలవారిపల్లె, దిగువపల్లె ఏరియాలోని ఏటిలో ఇసుక లభ్యత ఎక్కువగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనుల పేరుతో పెద్దలతో పాటు స్థానికంగా ఉన్న చోటా నాయకులు దీనిని బాగా క్యాష్ చేసుకున్నారు. నది వెంబడి రైతుల పొలాల కింద వరకు తవ్వేశారు. ఇసుకాసురులకు భయంపడిన రైతులు అప్పట్లో ఎక్కడా అడ్డు చెప్పలేదు. దీంతో ఇష్టానుసారం తవ్వేశారు. అయితే ప్రస్తుతం తిరిగి అప్పటి వైసీపీ నాయకులే ప్రస్తుతం కూటమి కార్యకర్తలుగా చెప్పుకుంటూ ఇసుక దందాకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా యంత్రాలతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లో సీజ్ చేసిన భారీ ఇసుక డంప్‌ను కూడా తరలించి సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. మందలవారిపల్లె నుంచి ప్రారంభమైన ఇసుక దందా గాలివీడు సమీపంలోని బండెమ్మ దిగువపల్లె వరకు తవ్వకాలు చేపడుతున్నారు. అధికార పార్టీగా చెప్పుకుంటూ అటు గాలివీడు, నంబులపూలుకుంట, ఇటు తంబళ్లపల్లె వరకు తరలిస్తున్నారు. రాత్రివేళలో టిప్పర్లతో తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇందులో భాగంగా దిగువపల్లెలో పెద్దేరు వెంబడి అయిదు చోట్ల తవ్వకాలు చేపట్టి ఇసుక నిల్వ చేశారు. దీనిని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తూ డిమాండ్‌ను బట్టి ట్రాక్టర్ లోడు రూ.3 వేలు, టిప్పర్ రూ.18 వేలకు విక్రయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పెద్దేరు మండలంలో మారుమూల ప్రాంతం కావడంతో అధికారుల పర్యవేక్షణ చాలా తక్కువగానే ఉంటోంది. దీనిని అదునుగా చేసుకున్న చోటా నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. పొలాల కింద వరకు కూడా ఇసుక తవ్వకాలు చేపడుతుండటంతో ఆగ్రహించిన రైతులు ఇసుక తరలింపును అడ్డుకున్నారు. చివరకు రెవెన్యూ అధికారులు రంగప్రవేశం చేసి రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలావుండగా ఇప్పటికే డంప్ చేసిన ఇసుక నిల్వలను అలాగే వదిలేస్తారా? లేక స్వాధీనం చేసుకుంటారా? అనే అంశంపై స్థానికంగా చర్చ నడుస్తోంది. మరోవైపు ఇదివరకే సీజ్ చేసిన ఇసుకపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో కూడా వేచి చూడాల్సి ఉంది.



ఎక్స్‌కవేటర్‌తో పెద్దేరులో ఇసుక తవ్వకాలు




గాలివీడు సరిహద్దులో ఏడి గడ్డపై ఇసుక నిల్వ, పెద్దమండ్యం పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

విద్యపై ఆనంవారిపల్లె..

- ఆ గ్రామమంతా ఉద్యోగస్తులే
- చదువు కోసం పరిగెడుతున్న పల్లె
- కష్టపడి కలలు నెరవేర్చుకుంటున్న యువత
- తల్లిదండ్రులు మాత్రమే వ్యవసాయం
- అందరికీ ఆదర్శం ఆనంవారిపల్లె

కష్టం చూసి కల నెరవేర్చుకున్నా..



మాది చిన్న వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు మాకున్న కొద్దిపొలంలో వ్యవసాయం చేస్తుంటారు. అయితే వ్యవసాయంలో పెట్టుబడి ఎక్కువ, ఆదాయం తక్కువ వచ్చేది. తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను దగ్గరుండి చూసి కష్టపడి చదివి ఎస్‌ఐ ఉద్యోగం సాధించాను.

- నేలటూరు రామ్మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ, ఆనంవారిపల్లె

డాక్టరు కావాలని సాధించా..



మా తల్లిదండ్రులు చేనేత కార్మికులు. మా తండ్రి మా గ్రామంలోనే చీరల వ్యాపారం చేస్తున్నారు. మేమిద్దం అన్నదమ్ములం. ఒక చెల్లెలు. ముగ్గురినీ చదవించారు. నేను పెద్ద డాక్టరు కావాలని చిన్నప్పటి నుంచి అనుకునేవాడిని. బాగా చదివి ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇప్పుడు పీజీలో ఆలిండియా 11వ ర్యాంకు సాధించాను.

- దండె హనుమత్ జానకీరామ్, ఎంబీబీఎస్ ఎండీ, ఆనంవారిపల్లె

ప్రభుత్వ టీచరు కావాలన్న కల..




మాది చిన్న వ్యవసాయ కుటుంబం. చదువుకుంటే ఉద్యోగం వస్తుందని బాగా కష్టపడి చదివాను. నాకు ప్రభుత్వ టీచరు కావాలని కల. ఎంతో ఇష్టపడి కష్టపడి ఉద్యోగం సాధించాను.

- దండె లక్ష్మీనారాయణమ్మ, ప్రభుత్వ టీచరు, ఆనంవారిపల్లె



జిల్లాలోనే మారుమూల మండలం. ఒకప్పుడు విద్యకు చాలా దూరంగా ఉండేది. ఇక్కడి ప్రజల జీవనాధారం వ్యవసాయం, పాడి, మేకలు, గొర్రెల పెంపకం. రానురాను గ్రామాలన్నీ నాగరికత పెరగడంతో పాటు యువత విద్యపై మక్కువ పెంచుకున్నారు. కష్టపడి చదివి కన్న కలలు నెరవేర్చుకుంటూ ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారు. దీంతో గ్రామాలన్నీ అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి. అందులో ఆనంవారిపల్లె గ్రామం ఒకటి. ఈ గ్రామంలో దాదాపు 140 కుటుంబాలు, 450 మంది జనాభా ఉన్నారు. కొంతమంది చేనేత మగ్గాలు నేస్తారు. మరికొంత మంది వ్యవసాయం, పాడిపశువులతో జీవిస్తూ తమ పిల్లలను పెద్ద చదువులు చదివిస్తున్నారు. ఆ గ్రామంలోని యువతీయువకులు విద్యపై కసి పెంచుకున్నారు. పోటీతత్వంతో కష్టపడి ఇష్టపడి చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధిస్తూ తల్లిదండ్రులను గర్వపడేలా చేస్తున్నారు. కన్న తల్లిదండ్రులను, పుట్టిపెరిగిన ఊరును ఆదర్శంగా నిలుపుతున్నారు.



- బి.కోడూరు (ఆంధ్రజ్యోతి)

విద్యపై కసి

గ్రామంలో ఒకరికి ఉద్యోగం వచ్చిందంటే నేను కూడా ఉద్యోగం సాధిస్తా అనే దృఢ సంకల్పంతో విద్యపై కసిగా చదివి అనుకున్న ఉద్యోగాలు సాధిస్తున్నారు. గ్రామంలో ఇప్పటికే 8మంది ప్రభుత్వ టీచర్లు, నలుగురు ఎస్‌ఐలు, ఇద్దరు డాక్టర్లు, 8 మంది ఆర్మీ, ఐదుగురు బ్యాంకు మేనేజర్లు, ఇద్దరు సైంటిస్టులు, ఆరుగురు సచివాలయ ఉద్యోగులు, దాదాపు 80మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో వివిధ కంపెనీల్లో పనిచేస్తున్నారు. ఆ గ్రామంలోని యువత ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో దూసుకుపోతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ గ్రామంలో ఏ చిన్నవాడితో మాట్లాడినా ఎస్‌ఐ, లేదా డాక్టరును అవుతాననే సమాధానం వస్తుంది.

ఆ గ్రామమే ఒక పచ్చతోరణం

ఆనంవారిపల్లె గ్రామంలో విశాలమైన రోడ్లు, ఇంటింటికీ ఒక చెట్టు ఉంటుంది. దీంతో గ్రామమంతా పచ్చతోరణంలా ఉంటుంది. ఇల్లు, పరిసరాలు, రోడ్లు, పరిశుభ్రంగా ఉంటాయి. చూడచక్కని ఇళ్లు నిర్మించుకున్నారు. ఆహ్లాదకరమైన ఆరోగ్యకరమైన వాతావరణంతో ఆనంవారిపల్లె శోభిల్లుతోంది.

కష్టపడుతున్న యువత

తమ తల్లిదండ్రులు కొంతమంది మగ్గాలు నేస్తుంటే మరికొంత మంది నష్టాలు తప్ప ఆదాయం లేని వ్యవసాయం చేస్తుంటే గమనించిన యువత కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని దృఢంగా సంకల్పించారు. చదువు ఒక్కటే తమను ఉన్నతస్థానంలో నిలుపుతుందని, అందుకోసం ఎంత కష్టాన్నైనా భరించేందుకు యువత పూనుకున్నారు. ఈ నేపధ్యంలో తమ కలలు నేర్చుకుని తల్లిదండ్రుల ముఖాల్లో ఆనందాన్ని, సమాజంలో గౌరవాన్ని నిలబెట్టుకున్నారు. ఈ పట్టుదల పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఉద్యోగం సాధించాలని పట్టుదలతో..



మాది వ్యవసాయ కుటుంబం. మా తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనులకు వెళ్లేవాడిని. ఎంత కష్టపడ్డా ఆదాయం వచ్చేది కాదు. పెట్టుబడికి ఆదాయం సరిపోయేది. చదివి ఉద్యోగం సాధించాలనుకున్నా. ఆర్మీలో ఉద్యోగం పొందాను.

- తిమ్మారెడ్డి చెన్నకేశవరెడ్డి, ఆర్మీ ఉద్యోగి, ఆనంవారిపల్లె

బ్యాంకు ఉద్యోగం కావాలని..



మా గ్రామంలోని యువతతో పాటు నేను కూడా పెద్ద ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదివాను. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియాలో క్యాష్ ఆఫీసరుగా ఉద్యోగం సాధించా.

- ముప్పూరి శివశంకర్, క్యాష్ ఆఫీసరు, ఆర్‌బీఐ, ఆనంవారిపల్లె



గ్రామంలోని అందమైన భవంతులు

ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మురళి,నరసింహారెడ్డి



మురళి



నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తుపాకుల మురళి, అట్లా నరసింహారెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం కడపనగరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కోశాధికారిగా చిన్న వెంకటసుబ్బయ్యతో పాటు ఇతర కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు హుస్సేన్, మల్యాద్రి, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మెగా డీఎస్సీ ఎంపిక తుది జాబితా విడుదల

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ఎంపిక పరిధిలోకి వచ్చిన అభ్యర్థుల ధ్రువపత్రాలను సవివరంగా పరిశీలించి, మేనేజ్‌మెంట్ వారీగా, పోస్టు వారీగా తుది ఎంపిక జాబితాలను రూపొందించడం జరిగింది. ఈ తుది జాబితాలను సెప్టెంబరు 15న విడుదల చేయనున్నారు. ఈ జాబితాలు సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం, మెగా డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్:// ఏపీడీఎస్సీ.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్/లో అందుబాటులో ఉంటాయి.

గంజాయి స్వాధీనం

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొజ్జవారిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం 1,700 గ్రాముల గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. కోడూరు ఎక్సైజ్ సీఐ తులసి తెలిపిన వివరాల మేరకు.. మండలానికి చెందిన రాకేష్, హరి, సుమన్ గంజాయి తరలిస్తున్నారని సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. ఆటో, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు ముద్దాయిలు పరారీలో ఉన్నారని తెలిపారు. అరెస్టు చేసిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలపారు.

జాతీయ స్థాయి చెస్ టోర్నమెంటులో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు



చెస్‌లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బెంగుళూరు రూరల్ జిల్లా చెస్ సంఘం, కర్ణాటక రాష్ట్రం చెస్ సంఘం సహకారంతో ఈనెల 13వ తేదీన బెంగుళూరు వైట్‌ఫీల్డ్ ఏరియా మంజునాథ కళ్యాణ మండపంలో జరిగిన జాతీయ స్థాయి చెస్ టోర్నమెంటులో జిల్లా చెస్ క్రీడాకారులు సత్తా చాటినట్లు జిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీస్ దర్బారి తెలిపారు. ఇందులో అండర్-16 బాలికల విభాగంలో లాస్యశ్రీ మూడో స్థానం, అలాగే అండర్-9 బాలికల విభాగంలో అమీనా మూడో స్థానం, అండర్-9 బాలుర విభాగంలో అర్హన్ 5వ స్థానం, అండర్-16 బాలుర విభాగంలో అనురాగ్ 6వ స్థానం, అండర్-12 బాలికల విభాగంలో లక్ష్మీమనుశ్రీ 6వ స్థానం, అండర్-16 బాలికల విభాగంలో సరయూ 10వ స్థానం సాధించారు. వీరితో పాటు ఈ టోర్నమెంటులో బెస్ట్ ఉమెన్ ప్లేయరుగా తబుస్సం పురస్కారం అందుకున్నారని ఆయన తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లోని సభా భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-30 గంటల నుండి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్, 10గంటల నుండి పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో అర్జీలు సమర్పించిన బాధితులు తమ అర్జీ ఏ దశలో ఉందో తెలుసుకొనేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1100 నెంబరుకు కాల్ చేయాలని ఆయన సూచించారు.

దంపతులకు గాయాలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గుర్రంకొండ మండలం రామాపురం గ్రామానికి చెందిన మణికుమార్, అతని భార్య యామిని ద్విచక్రవాహనంలో వాల్మీకీపురం మార్గంలో నిమ్మనపల్లి మీదుగా బోయకొండకు బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో కొండయ్యగారిపల్లి క్రాస్ వద్దకు రాగానే ద్విచక్రవాహనాన్ని మదనపల్లి నుండి నిమ్మనపల్లి వస్తున్న ప్యాసెంజర్ ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని ఓ ప్రైవేటు వాహనంలో మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. దీంతో ప్రమాదనికి కారణమైన దిగువపల్లికి చెందిన చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటో డ్రైవర్ల దరఖాస్తులకు మూడు రోజులే గడువు





- కొత్తగా నమోదయ్యే వారికి చివరి తేదీ ఈ నెల 19
- ఏడాదికి రూ.15 వేల నగదు సాయం
- కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులు
- అక్టోబరు 1న ముఖ్యమంత్రిచే పంపిణీ ప్రారంభం
- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

కలికిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు రూ.15వేల సాయం అందించేందుకు ప్రభుత్వం శనివారం రాత్రి మార్గదర్శకాలు విడుదల చేసింది. గతంలో వైసీపీ ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో ఈ పథకాన్ని అమలు చేసింది. కానీ అప్పట్లో స్వంతంగా ఆటో కలిగిన వాహనం నడుపుతున్న వారికి ఏడాదికి రూ.10వేలు వంతున మంజూరు చేశారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.15 వేలకు పెంచి అందజేయనుంది. గతంలో వాహన మిత్ర పథకం కింద లబ్ధిదారులుగా వున్నవారు మూడు రోజుల్లోగా అంటే ఈనెల 17వ తేదీలోగా స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవలసి వుంది. ఈ జాబితా ఇప్పటికే ప్రభుత్వం వద్ద సిద్ధంగా వుండటంతో మరోసారి స్థానికంగా పరిశీలించి అర్హులైన వారికి మంజూరు చేయనున్నారు. గతంలో లబ్ధి పొందని కొత్త డ్రైవరు/వాహన దారులు ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తు పంపుకోవలసి వుంటుంది. పాత/కొత్త దరఖాస్తులను స్వీకరించడం, సరిచూసి పరిశీలించే బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అప్పగించారు. తుది లబ్ధిదారుల జాబితాలను ఆయా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు పంపాల్సి వుంటుంది. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో 22వ తేదీకి పరిశీలన పూర్తి చేసిన అనంతరం కలెక్టర్లు 24వ తేదీ నాటికి రవాణా శాఖకు అప్పగించాల్సి వుంది. అనంతరం అక్టోబరు 1న సీఎం చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారంభిస్తారు.

లబ్ధిదారుల అర్హతలు

ప్యాసింజర్ ఆటో, మోటారు క్యాబ్, మాక్సీ క్యాబ్ యజమానులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. మూడు చక్రాల/నాలుగ చక్రాలు, తేలికపాటి రవాణా వాహనాలకు ఈ పథకం వర్తించదు. అర్హత కలిగిన వాహనాలు ఏపీలో రిజిస్ట్రేషన్ కలిగి వుండాలి. అదే విధంగా డ్రైవర్ల లైసెన్సులు కూడా ఏపీలోనే జారీ అయి వుండాలి. వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వుండాలి. ఆటోలకు మాత్రం దీని నుంచి తాత్కాలిక మినహాయింపు ఇచ్చారు. ప్రస్తుతానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకున్నా ఈ ఏడాది మంజూరు చేస్తారు. అనంతరం నెల రోజుల్లోగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించాలి. లేదంటే మరుసటి ఏడాది మంజూరు వుండదు. వాహనాల మీద ఎలాంటి పెండింగ్ చలాన్లు వుండకూడదు. లబ్ధిదారుడు ఆధార్, రేషన్ కార్డు కలిగి వుండాలి. ఒక కుటుంబంలో ఒక వాహనానికి లేదా ఒక డ్రైవరుకు మాత్రమే అర్హత వుంటుంది. ఒకే కుటుంబంలో ఒకరి పేరుతో వాహనం వుండి మరొకరి పేరుతో డ్రైవింగ్ లైసెన్స్ వున్నా చెల్లుబాటవుతుంది. వాహనం తప్పనిసరిగా డ్రైవరు అధీనంలో వుండాలి. అర్హత కలిగిన వారు, గతంలో లబ్ధి పొంది ఇప్పటికీ వాహనం కలిగిన వారు నేరుగా వారికి సంబంధించిన సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలి. దరఖాస్తుదారుని కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగులు లేదా రిటైర్మెంట్ పెన్షన్‌దార్లు వుండకూడదు. అయితే పారిశుధ్య కార్మికులకు మాత్రం ఇందులో మినహాయింపు వుంది. ఆదాయపన్ను చెల్లింపుదారులు కూడా కుటుంబంలో వుండకూడదు. నెలసరి విద్యుత్ వినియోగం 300 యూనిట్లు మించకూడదు (దీనికోసం 12 నెలల సరాసరి వినియోగాన్ని లెక్కిస్తారు) పట్టణాల్లో వేయి చ.అ. మించి స్థలం కూడా వుండకూడదు. ఇక 3ఎకరాల తడి లేదా 10 ఎకరాల మెట్ట భూములు మించి వుండకూడదు.

కార్పొరేషన్‌ల ద్వారా నిధుల విడుదల

అర్హులైన లబ్ధిదారులకు మంజూరయ్యే నిధులు కులాల వారీగా వారికి సంబంధించిన కార్పొషన్‌ల ద్వారా విడుదలవుతాయి. ఇందుకు గానూ రెడ్డి కార్పొరేషన్, బ్రాహ్మణ, ఎస్సీ కార్పొరేషన్, కమ్మ కార్పొరేషన్, ఎస్టీ కార్పొరేషన్, బీసీ-ఏ, బీ, సీ, ఇ గ్రూపులకు సంబంధించిన కార్పొరేషన్లు, మైనారిటీ కార్పొరేషన్, క్రిస్టియన్ కార్పొరేషన్, ఈబీసీ కార్పొరేషన్, ఆర్య వైశ్య కార్పొరేషన్, క్షత్రియ కార్పొరేషన్ల ద్వారా రూ.15వేల వంతున లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమవుతాయి.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా వర్ధినేని ప్రసాద్‌రెడ్డి



బద్వేలుటౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టర్‌గా బద్వేలుకు చెందిన తెలుగుదేశం పార్టీ ప్రధాన నాయకుడు వర్ధినేని ప్రసాద్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన సేవలను గుర్తించిన ప్రభుత్వం డైరెక్టర్ పదవిని కల్పించడంతో అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. కష్టకాలంలో కూడా పార్టీని ముందుకు తీసుకువెళుతూ, నియోజకవర్గంలో క్రియాశీలకంగా పాల్గొంటూ, కార్యకర్తలకు అండగా ఉంటూ మంచి గుర్తింపు పొందారు ప్రసాద్‌రెడ్డి. ఈయన సేవలను ఎప్పటికప్పుడు అధిష్ఠానం దృష్టికి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్ కుమార్‌రెడ్డి తీసుకువెళ్లి వారికున్న అభిమానాన్ని చాటుకున్నారు. ప్రసాద్‌రెడ్డికి పదవి రావడం పట్ల గోపవరం జడ్పీటీసీ కలువాయి జయరామిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భైసాని ప్రతాప్‌రెడ్డి, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మిత్తికాయల రమణయాదవ్, బ్రాహ్మణపల్లె సొసైటీ చైర్మన్ పి.రామానాయుడు, టీడీపీ నాయకులు కొండయ్య, నిమ్మకాయల గోపాల్‌రెడ్డి, పసుపులేటి శ్రీనివాసులు, వెంకటసుబ్బారెడ్డి, భూమిరెడ్డి రామ సుబ్బారెడ్డి, క్రిష్టారెడ్డి, జగదీశ్వరరెడ్డి, వివేకానందరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అప్పు చేసి అదృశ్యమయ్యాడు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అప్పు తీసుకున్న వ్యక్తి ఎవరికీ చెప్పకుండా పది రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి అదృశ్యమయ్యాడు. దీంతో అప్పు ఇచ్చిన వారు లబోదిబోమంటూ గుండెలు బాదుకుంటున్నారు. ఇటీవల పోరుమామిళ్లలో ఇలాంటి సంఘటనలు సర్వసాధారణమయ్యాయి. అప్పులు చేయడం, కనిపించకపోవడం, తీరా బాధితులు ఫిర్యాదు చేస్తే ఐపీ పెట్టడం మామూలైంది. పోరుమామిళ్లలోని వరికుంట్ల బస్టాండు సమీపంలో బంగారు వ్యాపారం చేసే ఒక వ్యక్తి ప్రొద్దుటూరు బంగారు వ్యాపారులకు రూ.30లక్షలు పెట్టి బంగారు వడ్డాణం కొనుగోలు చేశాడని, అదే నమ్మకంతో మరో వడ్డాణాన్ని చూపించి వస్తానని నమ్మించి ఎన్నిరోజులకు రాకపోవడంతో ప్రొద్దుటూరు బంగారు వ్యాపారులు పోరుమామిళ్ల వచ్చి విచారించినట్లు సమాచారం. ఈ క్రమంలో సదరు వ్యక్తికి అప్పు ఇచ్చిన వారు కూడా ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఒక్కోక్కరి వద్ద రూ.5లక్షల నుండి రూ.30లక్షల వరకు బాకీలు చేసినట్లు సమాచారం. 15 ఏళ్ల క్రితం అతను చేసిన అప్పులకు అతని తల్లిదండ్రులు వడ్డీతో సహా చెల్లించి ఇంకెప్పుడు తమ కుమారుడికి ఎవ్వరూ కూడా అప్పులు ఇవ్వవద్దని, ఇస్తే తమకు సంబంధం లేదని తల్లిదండ్రులు వేరుపడినట్లు తెలిసింది. కానీ బాకీ ఇచ్చినవారు తల్లిదండ్రులను వత్తిడి చేసే డబ్బులు వస్తాయి కదా అని భావించి ఆదివారం ఆ ప్రయత్నాలు కూడా చేశారు. కొందరు పెద్ద మనుషులు జోక్యం చేసుకుని ఇది మంచి పద్ధతి కాదని అతని తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టరాదని చెప్పినట్లు సమాచారం. ఏదిఏమైనా రెండు మూడురోజుల తరువాత ఈ విషయంపై పూర్తిగా క్లారిటీ రానుంది. అంత వరకు ఊహాగానాలు ప్రచారాలు కొనసాగుతుంటాయి.

స్టేషన్‌కు చేరిన ఆశ్రమ పాఠశాల వ్యవహారం

బి.కొత్తకోట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాల వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. సయోధ్యకు పెద్దలు జరిపిన ప్రయత్నాలు విఫలమవడంతో పాఠశాల యాజమాన్యం ఇరకాటంలో పడింది. బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పరిధిలోని సంస్కృత ఆశ్రమ పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల నడుమ జరిగిన ఘర్షణలో ఓ విద్యార్థి కంటికి తీవ్రగాయమవడం, గాయపడిన విద్యార్థి శేషాద్రి కుటుంబీకులు రూ.కోటి డిమాండ్ చేసినట్టు ప్రచారం జరగడం తెలిసిందే. విద్యార్థికి అవసరమైన చికిత్స చేయిస్తామని, సేవాదృక్పథంతో సంస్కృతి పరిరక్షణ కోసం నడుస్తున్న పాఠశాలను రచ్చకీడ్చవద్దని యాజమాన్యం పెద్దల ద్వారా బాధిత విద్యార్థి తండ్రి కడపకు చెందిన అమరనాథరెడ్డితో సయోధ్యకు తీవ్ర ప్రయత్నాలు జరిపింది. అయితే అందుకు అంగీకరించని విద్యార్థి తండ్రి ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు. తమకు న్యాయం చేయాలని పాఠశాల యాజమాన్యంపై కేసునమోదు చేయాలని పేర్కొన్నట్టు సమాచారం. ఈ విషయమై ఏఎస్‌ఐ భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ ఫిర్యాదు ఇచ్చినమాట వాస్తవేమనని, బాధితులతో పూర్తిగా చర్చించి కేసునమోదు చేస్తామన్నారు.

వైభవంగా అమ్మవారి త్రిశూల ప్రతిష్ఠ



త్రిశూలాన్ని ఊరేగింపు తీసుకువస్తున్న దృశ్యం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో పోలేరమ్మ అమ్మవారి త్రిశూల ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. పులివెందులలో అంకాళమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి, పోలేరమ్మ తల్లి అమ్మవార్లు ఒకే రీతిలో వెలిసి ఉన్నారు. ప్రాచీన చరిత్ర కలిగిన అమ్మవార్లకు పులివెందుల ప్రజలు ప్రతి ఏడాది ఉత్సవాలు, దేవర కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇటీవల కాలంలో గుర్తుతెలియని వ్యక్తులు పోలేరమ్మ అమ్మవారి ముందు ఉన్న త్రిశూలాన్ని తొలగింపజేశారని కొందరు తెలిపారు. పునఃప్రతిష్ఠించాలని చూసినప్పటికీ పలు కారణాలతో ప్రతిష్ఠించలేదు. దీంతో హిందువులంతా పెద్దఎత్తున ఉత్సవం నిర్వహించి త్రిశూలాన్ని ప్రతిష్ఠించాలని కంకణం కట్టుకున్నారు. ఈ నేపథ్యంలో పోలేరమ్మ అమ్మవారికి త్రిశూలాన్ని ప్రత్యేకంగా తయారు చేయించారు. ఆదివారం ఉదయం 8గంటల ప్రాంతంలో అంకాళమ్మ తల్లి ఆలయం నుంచి త్రిశూలం, అమ్మవారి రూపానికి ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, నృత్యాల నడుమ మహిళలు, యువతులు బోనాలు సమర్పిస్తూ పోలేరమ్మ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం జైపోలేరమ్మ తల్లి అంటూ నినాదాలు చేస్తూ త్రిశూలాన్ని ప్రతిష్ఠించారు. పెద్దఎత్తున భక్తులు జంతుబలులు సమర్పించారు. భారీఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పులివెందుల ఎస్‌ఐ విష్ణునారాయణ, ట్రైనీ ఎస్‌ఐ అనిల్‌కు మార్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సతీమణి, మాజీ సర్పంచు ఉమాదేవి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, బీజేపీ సీనియర్ నాయకుడు లక్షుమయ్య, తదితర టీడీపీ, బీజేపీ నాయకులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : చమర్తి

రాజంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాముల వారి ఆశీస్సులతో రాజంపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు తెలిపారు. ఆదివారం నియోజకవర్గంలోని హత్యరాల గ్రామ పంచాయతీలో నిర్మించిన శ్రీ రాముల దేవాలయంలో కల్యాణోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధిలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలుపుతానని తెలిపారు. అనంతరం గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు జగన్ మోహన్ రాజును పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, టిక్కమో మల్లి, మండల ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు పోలి శివకుమార్, హత్యరాల ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చమర్తి జగన్‌మోహన్ రాజుతో ఆలయ కమిటీ సభ్యులు

బోర్ల ఏర్పాటు..

నందలూరు: నియోజకవర్గ ఇన్‌చార్జి చొరవతో మండలంలోని పలు గ్రామాలకు 14 బోర్లు మంజూరు కాగా, ఆదివారం టంగుటూరులో బోరు వేశారని మండల టీడీపీ అధ్యక్షుడు జంగం శెట్టి సుబ్బయ్య, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు షర్మిల, బూత్ కన్వీనర్ మునగరామయ్య నాయకులు ఈశ్వరయ్య, రమేష్ నరసింహులు, శేఖర్ పాల్గొన్నారు.

రజకుల సంక్షేమం మరిచిన వైసీపీ



రజక సంఘం సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గాలివీడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ధోబీఘాట్లు నిర్వీర్యమయ్యాయని కడప, అన్నమయ్య జిల్లా రజక సంఘం అధ్యక్షులు రవి, రమేశ్ తెలిపారు. ఆదివారం మండలంలోని నూలివీడు పంచాయతీ నాగూరువాండ్లపల్లె సమీపంలోని ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో నిర్వహించిన గ్రామ రజకుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ధోబీఘాట్ల నిర్మాణానికి ఒక రూపాయి కూడా మంజూరు చేయలేదని తెలిపారు. రజకులకు పనిముట్లు కానీ, రుణాలను కానీ అందించలేదని తెలిపారు. పనిముట్లు పంపిణీ చేయడంతో పాటు ధోబీఘాట్లను నిర్మించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రజకులంతా ఐకమత్యంగా ఉండి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరీక్షించ డానికి ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమాలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మల్లికార్జున, రజక సంఘం నాయకులు సాయికుమార్, శ్రీని వాసులు, రమణ, బాలరాజు, రెడ్డెయ్య, రాఘవేంద్ర, కృష్ణ, చెంద్రాయుడు, నరసింహులు, ఎల్లేసు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్‌కు సన్మానం



మార్కెట్ యార్డు చైర్మన్ షఫీనాయక్‌ను సన్మానిస్తున్న డైరెక్టర్లు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్ ఎండీ షఫీనాయక్‌కు ఆది వారం లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డు డైరెక్టర్లు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా షఫీనాయక్ మా ట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, రోడ్డు రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి, రాయచోటి టీడీపీ నాయకులు మండి పల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న మార్కెట్ యార్డు రోజు రోజుకు అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు కొండూరు వెంకట్రామరాజు, టీడీపీ యూత్ ప్రెసిడెంట్ గోమిలిపక్కీరయ్య, కావలి అంజనేయులు, రవిచారి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా సతీమణి వరలక్ష్మి

పెనగలూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు, నల్లపురెడ్డిపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ అందజేశారు. నల్లపురెడ్డిపలి పార్నపల్లె జనార్దన్ రెడ్డికి రూ.1.84 లక్షలు, పెనగలూరుకు చెందిన పాతల శ్రీనివాసులకు రూ.59 వేల చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాసరి దామోదర్ నాయుడు, మండల జనసేన ప్రధాన కార్యదర్శి జి.హరిబాబు రాయల్, కే.సుదర్శన చౌదరి, మారం రెడ్డి శివయ్య, ఎల్. రెడ్డయ్య. వి పాల్‌రెడ్డి, కె.సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

11వ పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న సంఘ నాయకులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు 11వ పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీసీ రెడ్డెన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీవో హోంలో జిల్లా అధ్యక్షులు బీవీ రమణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పెన్షనర్లకు సంబంధించిన డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీ, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు 8వ పీఆర్‌సీని , పీఎఫ్‌డీఏ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ట్రెజరర్ జయచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు శ్రీరామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి తెలిపారు. ఆదివారం ప్రాజెక్టు మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి హాజరయ్యారు. అనంతరం ప్రాజెక్టు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా సుకుమారి, ప్రధాన కార్యదర్శిగా ఓబులమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీదేవి, సహాయ కార్యదర్శిగా శ్రీవాణి, గౌరవాధ్యక్షులుగా ప్రభావతిని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, రాబోయే రోజుల్లో అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దశరా ఉత్సవాల బ్రోచర్ విడుదల

రైల్వేకోడూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దశరా ఉత్సవాలను ఈ నెల 22 నుంచి అక్టోబరు 4 వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్ తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి రోజు అమ్మవారి అలంకరణలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కొప్పరపు నరసింహులు, మేడా వెంకటసుబ్బయ్య, కామిరెడ్డి పార్థసారథి, ప్రధాన కార్యదర్శి చలపాటి హరినాథ్, కోశాధికారి కామిశెట్టి వీర వెంకటసత్యనారాయణగుప్తా, ఆర్గనైజింగ్ కార్యదర్శి కలపాటి శ్రీధర్, దేవస్థానం అధ్యక్షుడు కామిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోనే కార్యకర్తలకు న్యాయం

ఒంటిమిట్ట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): టీడీపీలోనే సామాన్య కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని మండపంపల్లి ఎంపీటీసీ సభ్యుడు కడప జిల్లా నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు సంకేసుల బాషా తెలిపారు. ఆదివారం కడపలోని దూదేకుల వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ నాగూర్ వీరభద్రుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య కార్యకర్తగా ఎదిగిన డాక్టర్ వీరభద్రుడుని పార్టీ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమించడం సామాన్య కార్తకర్తకు న్యాయం జరుగుతుందని చెప్పడానికి నిదర్శనమన్నారు. ఈ కార్యకమంలో నూర్‌బాషా సంఘం నాయకులు రాజన్న కమల్ బాషా, హుస్సేన్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

అపుస్మా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా దామోదరవల్లి



సన్మానం అందుకుంటున్న దామోదరవల్లి

ఓబులవారిపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అపుస్మా రాయలసీమ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా మండలానికి చెందిన తోట దామోదరవల్లి ఎన్నికయ్యారని శ్రీరిషి స్కూల్ కరస్పాండెంట్ యువరాజు తెలిపారు. ఆదివారం నిర్వహించిన అపుస్మా కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంచంద్రారెడ్డి, రాష్ట్ర అపుస్మా అధ్యక్షుడు తులసి విష్ణు ప్రసాద్ అవార్డును దామోదరవల్లికి అందజేశారు. పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు, విద్యార్థు ల తల్లిదండ్రులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

ఏపీఐసీసీ డైరెక్టర్‌కు సన్మానం



కొండా భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న పోలిరెడ్డి సుబ్బారెడ్డి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డిని ఆదివారం డీసీసీబీ మాజీ డైరెక్టర్ పోలి రెడ్డి సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు చంద్ర మౌళి, దేవప్రకాశ్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో అందరికీ న్యాయం జరిగిందని, చంద్ర బాబునాయుడు 15 నెలల పరిపాలనలో ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని, రాష్ట్రంలో ప్రజలు అంత సురక్షితంగా ఉన్నారని కొండాభాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'భవిష్యత్తులో వైసీపీ కనుమరుగు ఖాయం'

రైల్వేకోడూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో వైసీపీ కనుమరుగు కావడం ఖాయమని రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పి. రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు లోని తన నివాసంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి పక్క రాష్ట్రాలు కూడా విస్తు పోతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ ప్రజాసంక్షేమంపైనే దృష్టి సారించారని తెలిపారు. వైఎస్ జగన్ కూటమి ప్రభుత్వంపై చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టడానికి తామంతా ఉన్నామన్నారు. వైసీపీ హయాంలో ఎంతో మంది చావులకు ఆ పార్టీ నాయకులు కారణమయ్యారన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

'దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలి'

రైల్వేకోడూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పుల్లంపేట మండల సీపీఐ నాయకుడు సెల్వన్‌కుమార్‌పై దాడి చేసిన వ్యక్తులను పోలీసులు ఇంత వరకు అరెస్టు చేయలేదని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్, జిల్లా కమిటీ సభ్యులు సిగె చెన్నయ్య ఆరోపించారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసును ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. దాడి చేసిన వ్యక్తులు దర్జాగా తిరుగుతున్నా ఎందుకు అదుపులోకి తీసుకోలేదన్నారు. ఈ కేసు లో అధికారులు ప్రలోభాలకు లొంగుతున్నారనే అనుమానాలు వస్తున్నాయన్నారు.

5న కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ

చిన్నమండెం, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలంలోని రోడ్డువారకుర్వపల్లిలో చిన్నమండెం మండల కురవ సంఘం అధ్యక్షుడు ముక్కంటి రవి ఆధ్వర్యంలో అక్టోబర్ 5న తిరుపతిలో నిర్వహించనున్న కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో . తిరుపతి జిల్లా కురబ సంఘం అధ్యక్షుడు మంగిరి రెడ్డెప్ప, చెర్లోపల్లి మల్లయ్య, శ్రీను, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నేతలను కలిసిన మోడెం వీరాంజనేయప్రసాద్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 14 (ఆం ధ్రజ్యోతి): విశాఖ పట్నంలో జరుగుతు న్న బీజేపీ సభకు విచ్చేసిన ఆ పార్టీ జాతీయ నాయ కుల ను మోడెం వీరాంజనే యప్రసాద్ ఆదివారం కలిశారు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి భూపతిరాజు, శ్రీని వాస్ వర్మ, మధుకర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ఏపీ బీజేపీ ఇన్‌చార్జి శ్రీనివాస్ ను విశాఖప ట్నం ఎయిర్‌పోర్టులో శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.

విద్యార్థులు పాఠశాల రుణం తీర్చుకోవాలి

నందలూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): చదువు నేర్పిన గురువులకు పాఠశాలకు రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ అని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ తెలిపారు. నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు సమ్మెట శివప్రసాద్, ఏనుగుల బాలాంజనేయులు ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు రాధాకృష్ణ, వెంకటరెడ్డి, హనుమం తు రెడ్డి, చలమయ్య, నిసార్, సుధాకర్, లక్ష్మీదేవి, చంద్రకుమారి, శకుంతలకు శిష్యులు పాదపూజ చేసి పట్టు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో పూర్వ విద్యార్థులు బండాత్మకూరు శివకుమార్, సుబ్రహ్మణ్యం, రవికుమార్, ఫైజులు, నాగభూషణం, మాకం జయశ్రీ, సుజాత, ఉమామహేశ్వర, అంబికేశ్వరి, అమృత వల్లి, నూరుల్లా, శ్రీనివాసులు, రహంతుల్లా, మోహన్, పెంచలయ్య పాల్గొన్నారు.


నేడు టీడీపీ కార్యకర్తల సమావేశం

సుండుపల్లె, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నియో జకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్ రాజు సోమవారం సుండుపల్లెకు రానున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు కల్లే రెడ్డెప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని బైరవగుట్ట నుంచి బస్టాండు మీదు గా టీడీపీ కార్యాలయం వరకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, మండల ప్రజలు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

'పోరాటాలతోనే సమస్యల పరిష్కారం'

రాయచోటిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమష్టి పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది కే. రవిశంకర్ తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన ఏపీ కురమ, కురబ, కురవ సంక్షేమ సంఘం 10వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా అక్టోబర్ 12న విజయవాడలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో జరగనున్న వార్షికోత్సవాల పోస్టర్లను ఆదివారం రాయచోటి పట్టణంలోని అజయ్ రెసిడెన్సీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కురమ, కురబ, కురవ కులస్తులు అందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడుగా నరసింహ



రాజంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడుగా రాజంపేట మండలం భువనగిరి పల్లెకు చెందిన కే.ఎస్.నరసింహను జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం తిరుపతి పట్టణంలో జరిగిన రాయల సీమ జిల్లాల బలిజ సంఘం నాయకుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు తిరు పతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన నాయకులు హరిప్రసాద్ అభినందించారు.

బైకు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు..

పుల్లంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బైకు అదుపుతపడంతో ఇరువురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక వైఎస్సార్ కాలనీకి చెందిన శివకృష్ణ, చరణ్ ఆదివారం సాయంత్రం బైకుపై వెళుతూ చిట్వేలి రోడ్డులోని దిగువపల్లి వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ఫెన్సింగ్ ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ 108 వాహనంలో రాజంపేట ఆసుపత్రికి అనంతరం తిరుపతికి తరలించారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కంటి చికిత్స శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గాలివీడు, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎగువగొట్టివీడు గ్రామంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి పరీ క్షలు నిర్వహించి 25 మందిని ఆపరేషన్ల కోసం తిరుపతి అరవింద్ ఐ హాస్పిటల్‌కు తరలిం చారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు వైవీఎస్ ప్రకాశ్, డెకరేట్ ఎస్. మహేశ్‌రాజు, ట్రెజరర్ సూర్యప్రకాశ్, రోటరీక్లబ్ డిస్ట్రిక్ ఆఫీసర్లు, సభ్యులు, కుప్పం ఫ్యామిలీస్, వాసవి వనిత క్లబ్ రాయచోటి సభ్యులు, అరవింద్ ఐ హాస్పిటల్ వైద్య బృందం పాల్గొన్నారు.

27 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్: పట్టణ పరిధిలోని లయన్స్ క ంటి ఆసుపత్రిలో ఆదివారం 55 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అందులో అర్హులైన 27 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 28 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యపై ఆనంవారిపల్లె..

● ఆ గ్రామమంతా ఉద్యోగస్తులే ● చదువు కోసం పరిగెడుతున్న పల్లె ● కష్టపడి కలలు నెరవేర్చుకుంటున్న యువత
● తల్లిదండ్రులు మాత్రమే వ్యవసాయం ● అందరికీ ఆదర్శం ఆనంవారిపల్లె



కష్టం చూసి కల నెరవేర్చుకున్నా..



మాది చిన్న వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు మాకున్న కొద్దిపొలంలో వ్యవసాయం చేస్తుంటారు. అయితే వ్యవసాయంలో పెట్టుబడి ఎక్కువ, ఆదాయం తక్కువ వచ్చేది. తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను దగ్గరుండి చూసి కష్టపడి చదివి ఎస్ఐ ఉద్యోగం సాధించాను.

- నేలటూరు రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఐ, ఆనంవారిపల్లె

డాక్టరు కావాలని సాధించా..



మా తల్లిదండ్రులు చేనేత కార్మికులు. మా తండ్రి మా గ్రామంలోనే చీరల వ్యాపారం చేస్తున్నారు. మేమిద్దం అన్నదమ్ములం. ఒక చెల్లెలు. ముగ్గురినీ చదవించారు. నేను పెద్ద డాక్టరు కావాలని చిన్నప్పటి నుంచి అనుకునేవాడిని. బాగా చదివి ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇప్పుడు పీజీలో ఆలిండియా 11వ ర్యాంకు సాధించాను.

- దండె హనుమత్ జానకీరామ్, ఎంబీబీఎస్ ఎండీ, ఆనంవారిపల్లె


ప్రభుత్వ టీచరు కావాలన్న కల..



మాది చిన్న వ్యవసాయ కుటుంబం. చదువుకుంటే ఉద్యోగం వస్తుందని బాగా కష్టపడి చదివాను. నాకు ప్రభుత్వ టీచరు కావాలని కల. ఎంతో ఇష్టపడి కష్టపడి ఉద్యోగం సాధించాను.

- దండె లక్ష్మీనారాయణమ్మ, ప్రభుత్వ టీచరు, ఆనంవారిపల్లె

జిల్లాలోనే మారుమూల మండలం. ఒకప్పుడు విద్యకు చాలా దూరంగా ఉండేది. ఇక్కడి ప్రజల జీవనాధారం వ్యవసాయం, పాడి, మేకలు, గొర్రెల పెంపకం. రానురాను గ్రామాలన్నీ నాగరికత పెరగడంతో పాటు యువత విద్యపై మక్కువ పెంచుకున్నారు. కష్టపడి చదివి కన్న కలలు నెరవేర్చుకుంటూ ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారు. దీంతో గ్రామాలన్నీ అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి. అందులో ఆనంవారిపల్లె గ్రామం ఒకటి. ఈ గ్రామంలో దాదాపు 140 కుటుంబాలు, 450 మంది జనాభా ఉన్నారు. కొంతమంది చేనేత మగ్గాలు నేస్తారు. మరికొంత మంది వ్యవసాయం, పాడిపశువులతో జీవిస్తూ తమ పిల్లలను పెద్ద చదువులు చదివిస్తున్నారు. ఆ గ్రామంలోని యువతీయువకులు విద్యపై కసి పెంచుకున్నారు. పోటీతత్వంతో కష్టపడి ఇష్టపడి చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధిస్తూ తల్లిదండ్రులను గర్వపడేలా చేస్తున్నారు. కన్న తల్లిదండ్రులను, పుట్టిపెరిగిన ఊరును ఆదర్శంగా నిలుపుతున్నారు.



- బి.కోడూరు (ఆంధ్రజ్యోతి)

విద్యపై కసి

గ్రామంలో ఒకరికి ఉద్యోగం వచ్చిందంటే నేను కూడా ఉద్యోగం సాధిస్తా అనే దృఢ సంకల్పంతో విద్యపై కసిగా చదివి అనుకున్న ఉద్యోగాలు సాధిస్తున్నారు. గ్రామంలో ఇప్పటికే 8మంది ప్రభుత్వ టీచర్లు, నలుగురు ఎస్ఐలు, ఇద్దరు డాక్టర్లు, 8 మంది ఆర్మీ, ఐదుగురు బ్యాంకు మేనేజర్లు, ఇద్దరు సైంటిస్టులు, ఆరుగురు సచివాలయ ఉద్యోగులు, దాదాపు 80మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో వివిధ కంపెనీల్లో పనిచేస్తున్నారు. ఆ గ్రామంలోని యువత ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో దూసుకుపోతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ గ్రామంలో ఏ చిన్నవాడితో మాట్లాడినా ఎస్ఐ, లేదా డాక్టరును అవుతాననే సమాధానం వస్తుంది.

ఆ గ్రామమే ఒక పచ్చతోరణం

ఆనంవారిపల్లె గ్రామంలో విశాలమైన రోడ్లు, ఇంటింటికీ ఒక చెట్టు ఉంటుంది. దీంతో గ్రామమంతా పచ్చతోరణంలా ఉంటుంది. ఇల్లు, పరిసరాలు, రోడ్లు, పరిశుభ్రంగా ఉంటాయి. చూడచక్కని ఇళ్లు నిర్మించుకున్నారు. ఆహ్లాదకరమైన ఆరోగ్యకరమైన వాతావరణంతో ఆనంవారిపల్లె శోభిల్లుతోంది.

కష్టపడుతున్న యువత

తమ తల్లిదండ్రులు కొంతమంది మగ్గాలు నేస్తుంటే మరికొంత మంది నష్టాలు తప్ప ఆదాయం లేని వ్యవసాయం చేస్తుంటే గమనించిన యువత కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని దృఢంగా సంకల్పించారు. చదువు ఒక్కటే తమను ఉన్నతస్థానంలో నిలుపుతుందని, అందుకోసం ఎంత కష్టాన్నైనా భరించేందుకు యువత పూనుకున్నారు. ఈ నేపధ్యంలో తమ కలలు నేర్చుకుని తల్లిదండ్రుల ముఖాల్లో ఆనందాన్ని, సమాజంలో గౌరవాన్ని నిలబెట్టుకున్నారు. ఈ పట్టుదల పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఉద్యోగం సాధించాలని పట్టుదలతో..



మాది వ్యవసాయ కుటుంబం. మా తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనులకు వెళ్లేవాడిని. ఎంత కష్టపడ్డా ఆదాయం వచ్చేది కాదు. పెట్టుబడికి ఆదాయం సరిపోయేది. చదివి ఉద్యోగం సాధించాలనుకున్నా. ఆర్మీలో ఉద్యోగం పొందాను.

- తిమ్మారెడ్డి చెన్నకేశవరెడ్డి, ఆర్మీ ఉద్యోగి, ఆనంవారిపల్లె

బ్యాంకు ఉద్యోగం కావాలని..



మా గ్రామంలోని యువతతో పాటు నేను కూడా పెద్ద ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదివాను. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియాలో క్యాష్ ఆఫీసరుగా ఉద్యోగం సాధించా.

- ముప్పూరి శివశంకర్, క్యాష్ ఆఫీసరు, ఆర్‌బీఐ, ఆనంవారిపల్లె



గ్రామంలోని అందమైన భవంతులు

నేడు మెగా డీఎస్సీ ఎంపిక తుది జాబితా విడుదల

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ఎంపిక పరిధిలోకి వచ్చిన అభ్యర్థుల ధ్రువపత్రాలను సవివరంగా పరిశీలించి, మేనేజ్‌మెంట్ వారీగా, పోస్టు వారీగా తుది ఎంపిక జాబితా లను రూపొందించడం జరిగింది. ఈ తుది జాబితాలను సెప్టెంబరు 15న విడుదల చేయనున్నారు. ఈ జాబితాలు సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం, మెగా డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://ఏపీడీఎస్ సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/లో అందుబాటులో పెట్టనున్నారు.

జాతీయ స్థాయి చెస్ టోర్నమెంటులో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు



కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బెంగుళూరు రూరల్ జిల్లా చెస్ సంఘం, కర్ణాటక రాష్ట్రం చెస్ సంఘం సహకారంతో ఈనెల 13వ తేదీన బెంగుళూరు వైట్‌ఫీల్డ్ ఏరియా మంజునాధ కళ్యాణ మండపంలో జరిగిన జాతీయ స్థాయి చెస్ టోర్నమెంటులో జిల్లా చెస్ క్రీడాకారులు సత్తా చాటినట్లు జిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీస్ దర్బారి తెలిపారు. ఇందులో అండర్-16 బాలికల విభాగంలో లాస్యశ్రీ మూడో స్థానం, అలాగే అండర్-9 బాలికల విభాగంలో అమీనా మూడో స్థానం, అండర్-9 బాలుర విభాగంలో అర్జున్ 5వ స్థానం, అండర్-16 బాలుర విభాగంలో అనురాగ్ 6వ స్థానం, అండర్-12 బాలికల విభాగంలో లక్ష్మీమనుశ్రీ 6వ స్థానం, అండర్-16 బాలికల విభాగంలో సరయూ 10వ స్థానం సాధించారు. వీరితో పాటు ఈ టోర్నమెంటులో బెస్ట్ ఉమెన్ ప్లేయరుగా తబుస్సం పురస్కారం అందుకున్నారని ఆయన తెలిపారు.

గంజాయి స్వాధీనం

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొజ్జవారిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం 1,700 గ్రాముల గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. కోడూరు ఎక్సైజ్ సీఐ తులసి తెలిపిన వివరాల మేరకు.. మండలానికి చెందిన రాకేష్, హరి, సుమన్ గంజాయి తరలిస్తున్నారని సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. ఆటో, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు ముద్దాయిలు పరారీలో ఉన్నారని తెలిపారు. అరెస్టు చేసిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలపారు.

యువతిని వేధిస్తున్న కేసులో వ్యక్తికి రిమాండు

కలికిరి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని మోసగించి ఆపైన వేధింపులకు పాల్పడుతున్న పఠాన్ ఇమ్రాన్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేసి ఆదివారం రిమాండుకు తరలించారు. పోలీసుల కథనం మేరకు... తిరుపతి శివార్లలోని ఒక యూనివర్సిటీలో ఎంసీఏ చదువుతున్న యువతిని కలికిరి పట్టణం సంత వీధి వాసి పఠాన్ ఇమ్రాన్ ఖాన్ ప్రేమ పేరుతో సన్నిహితంగా మెలిగాడు. చదువు పూర్తికాగానే ఆ యువతి సొంత ఊరికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇమ్రాన్ ఖాన్ ఆమెను వేధించడం మొదలు పెట్టాడు. పాత ఫొటోలను యువతి బంధువులకు, స్నేహితులకూ పంపుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడు. ఇమ్రాన్ ఖాన్ బ్లాక్ మెయిలింగ్ తీవ్రం కావడంతో నాలుగు రోజుల కిందట ఆ యువతి నేరుగా కలికిరికి వచ్చి తనకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన సీఐ అనిల్‌కుమార్ నిందితున్ని శనివారం అరెస్టు చేశారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

ద్విచక్రవాహనం, కారు ఢీ

● ఇద్దరు కర్నాటక యువకులకు తీవ్ర గాయాలు

కురబలకోట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం, కారు ఢీకొనడంతో ఇద్దరు కర్నాటక యువకులు తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం చింతామణి తాలూకా చేలూరు సమీపంలోని బైరామ్‌పల్లెకు చెందిన మనీష్(25), శశి(17) సమీప బంధువులు. కాగా ఆ యువకులు ఉదయం ద్విచక్రవాహనంలో బయలుదేరి బోయకొండ అమ్మవారి దర్శనానికి వెళ్ళి అక్కడ అమ్మవారి దర్శనం చేసుకుని బయలుదేరారు. కాగా మార్గమధ్యంలోని కురబలకోట మండలం కంటేవారిపల్లె సమీపంలో కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. కాగా ప్రమాదంలో ద్విచక్రవాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా వైద్యులు పరీక్షించి శశి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సల నిమిత్తం బెంగళూరుకి తరలించారు. ప్రమాదం జరగడంతో ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లోని సభా భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-30 గంటల నుండి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్, 10గంటల నుండి పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో అర్జీలు సమర్పించిన బాధితులు తమ అర్జీ ఏ దశలో ఉందో తెలుసుకొనేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1100 నెంబరుకు కాల్ చేయాలని ఆయన సూచించారు.

దంపతులకు గాయాలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గుర్రంకొండ మండలం రామాపురం గ్రామానికి చెందిన మణికుమార్, అతని భార్య యామిని ద్విచక్రవాహనంలో వాల్మీకీపురం మార్గంలో నిమ్మనపల్లి మీదుగా బోయకొండకు బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో కొండయ్యగారిపల్లి క్రాస్ వద్దకు రాగానే ద్విచక్రవాహనాన్ని మదనపల్లి నుండి నిమ్మనపల్లి వస్తున్న ప్యాసెంజర్ ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని ఓ ప్రైవేటు వాహనంలో మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. దీంతో ప్రమాదనికి కారణమైన దిగువపల్లికి చెందిన చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆటో డ్రైవర్ల దరఖాస్తులకు మూడు రోజులే గడువు

● కొత్తగా నమోదయ్యే వారికి చివరి తేదీ ఈ నెల 19
● ఏడాదికి రూ.15 వేల నగదు సాయం
● కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులు
● అక్టోబరు 1న ముఖ్యమంత్రిచే పంపిణీ ప్రారంభం
● మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

కలికిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు రూ.15వేల సాయం అందించేందుకు ప్రభుత్వం శనివారం రాత్రి మార్గదర్శకాలు విడుదల చేసింది. గతంలో వైసీపీ ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో ఈ పథకాన్ని అమలు చేసింది. కానీ అప్పట్లో స్వంతంగా ఆటో కలిగిన వాహనం నడుపుతున్న వారికి ఏడాదికి రూ.10వేలు వంతున మంజూరు చేశారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.15 వేలకు పెంచి అందజేయనుంది. గతంలో వాహన మిత్ర పథకం కింద లబ్ధిదారులుగా వున్నవారు మూడు రోజుల్లోగా అంటే ఈనెల 17వ తేదీలోగా స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవలసి వుంది. ఈ జాబితా ఇప్పటికే ప్రభుత్వం వద్ద సిద్ధంగా వుండటంతో మరోసారి స్థానికంగా పరిశీలించి అర్హులైన వారికి మంజూరు చేయనున్నారు. గతంలో లబ్ధి పొందని కొత్త డ్రైవరు/వాహనదారులు ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తు పంపుకోవలసి వుంటుంది. పాత/కొత్త దరఖాస్తులను స్వీకరించడం, సరిచూసి పరిశీలించే బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అప్పగించారు. తుది లబ్ధిదారుల జాబితాలను ఆయా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు పంపాల్సి వుంటుంది. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో 22వ తేదీకి పరిశీలన పూర్తి చేసిన అనంతరం కలెక్టర్లు 24వ తేదీ నాటికి రవాణా శాఖకు అప్పగించాల్సి వుంది. అనంతరం అక్టోబరు 1న సీఎం చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారంభిస్తారు.

లబ్ధిదారుల అర్హతలు

ప్యాసింజర్ ఆటో, మోటారు క్యాబ్, మాక్సీ క్యాబ్ యజమానులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. మూడు చక్రాల/నాలుగ చక్రాలు, తేలికపాటి రవాణా వాహనాలకు ఈ పథకం వర్తించదు. అర్హత కలిగిన వాహనాలు ఏపీలో రిజిస్ట్రేషన్ కలిగి వుండాలి. అదే విధంగా డ్రైవర్ల లైసెన్సులు కూడా ఏపీలోనే జారీ అయి వుండాలి. వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వుండాలి. ఆటోలకు మాత్రం దీని నుంచి తాత్కాలిక మినహాయింపు ఇచ్చారు. ప్రస్తుతానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకున్నా ఈ ఏడాది మంజూరు చేస్తారు. అనంతరం నెల రోజుల్లోగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించాలి. లేదంటే మరుసటి ఏడాది మంజూరు వుండదు. వాహనాల మీద ఎలాంటి పెండింగ్ చలాన్లు వుండకూడదు. లబ్ధిదారుడు ఆధార్, రేషన్ కార్డు కలిగి వుండాలి. ఒక కుటుంబంలో ఒక వాహనానికి లేదా ఒక డ్రైవరుకు మాత్రమే అర్హత వుంటుంది. ఒకే కుటుంబంలో ఒకరి పేరుతో వాహనం వుండి మరొకరి పేరుతో డ్రైవింగ్ లైసెన్స్ వున్నా చెల్లుబాటవుతుంది. వాహనం తప్పనిసరిగా డ్రైవరు అధీనంలో వుండాలి. అర్హత కలిగిన వారు, గతంలో లబ్ధి పొంది ఇప్పటికీ వాహనం కలిగిన వారు నేరుగా వారికి సంబంధించిన సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలి. దరఖాస్తుదారుని కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగులు లేదా రిటైర్మెంట్ పెన్షన్‌దార్లు వుండకూడదు. అయితే పారిశుధ్య కార్మికులకు మాత్రం ఇందులో మినహాయింపు వుంది. ఆదాయపన్ను చెల్లింపుదారులు కూడా కుటుంబంలో వుండకూడదు. నెలసరి విద్యుత్ వినియోగం 300 యూనిట్లు మించకూడదు (దీనికోసం 12 నెలల సరాసరి వినియోగాన్ని లెక్కిస్తారు) పట్టణాల్లో వేయి చ.అ. మించి స్థలం కూడా వుండకూడదు. ఇక 3ఎకరాల తడి లేదా 10 ఎకరాల మెట్ట భూములు మించి వుండకూడదు.

కార్పొరేషన్‌ల ద్వారా నిధుల విడుదల

అర్హులైన లబ్ధిదారులకు మంజూరయ్యే నిధులు కులాల వారీగా వారికి సంబంధించిన కార్పొరేషన్‌ల ద్వారా విడుదలవుతాయి. ఇందుకు గానూ రెడ్డి కార్పొరేషన్, బ్రాహ్మణ, ఎస్సీ కార్పొరేషన్, కమ్మ కార్పొరేషన్, ఎస్టీ కార్పొరేషన్, బీసీ-ఏ, బీ, సీ, ఇ గ్రూపులకు సంబంధించిన కార్పొరేషన్లు, మైనారిటీ కార్పొరేషన్, క్రిస్టియన్ కార్పొరేషన్, ఈబీసీ కార్పొరేషన్, ఆర్య వైశ్య కార్పొరేషన్, క్షత్రియ కార్పొరేషన్ల ద్వారా రూ.15వేల వంతున లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమవుతాయి.

యువకుడు మృతి

కలికిరి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కలికిరి-తిరుపతి పాత రోడ్డు మార్గంలో చింతలవారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల వాచ్‌మెన్ ఎం.హరినాథ (44) మృతి చెందాడు. ఆదివారం సాయంకాలం జరిగిన సంఘన వివరాల్లోకెళితే.... కొర్లకుంట గ్రామం తిమ్మారెడ్డి మాదిగపల్లెకు చెందిన ఎం.హరినాథ జేఎన్టీయూ కాలేజీలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కళాశాల సిబ్బంది క్వార్టర్‌లో కాపురమున్నాడు. ఆదివారం స్వగ్రామానికి వెళ్లడానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. కాగా చింతలవారిపల్లె రోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. సమాచారం అందిన కొందరు బంధువులు ప్రమాద స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన హరినాథను కలికిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చేర్చిన కొద్ది సేపటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్ ఆశాలత తెలిపారు. తలకు బలమైన గాయవడం, చెవుల్లో రక్తం కారినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. వాహనం అదుపు తప్పిందా, లేదా ఏదైనా వాహనం ఢీకొందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హరినాథ మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు.

స్టేషన్‌కు చేరిన ఆశ్రమ పాఠశాల వ్యవహారం

బి.కొత్తకోట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాల వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. సయోధ్యకు పెద్దలు జరిపిన ప్రయత్నాలు విఫలమవడంతో పాఠశాల యాజమాన్యం ఇరకాటంలో పడింది. బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పరిధిలోని సంస్కృత ఆశ్రమ పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల నడుమ జరిగిన ఘర్షణలో ఓ విద్యార్థి కంటికి తీవ్రగాయమవడం, గాయపడిన విద్యార్థి శేషాద్రి కుటుంబీకులు రూ.కోటి డిమాండ్ చేసినట్టు ప్రచారం జరగడం తెలిసిందే. విద్యార్థికి అవసరమైన చికిత్స చేయిస్తామని, సేవాదృక్పథంతో సంస్కృతి పరిరక్షణ కోసం నడుస్తున్న పాఠశాలను రచ్చకీడ్చవద్దని యాజమాన్యం పెద్దల ద్వారా బాధిత విద్యార్థి తండ్రి కడపకు చెందిన అమరనాథరెడ్డితో సయోధ్యకు తీవ్ర ప్రయత్నాలు జరిపింది. అయితే అందుకు అంగీకరించని విద్యార్థి తండ్రి ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు. తమకు న్యాయం చేయాలని పాఠశాల యాజమాన్యంపై కేసునమోదు చేయాలని పేర్కొన్నట్టు సమాచారం. ఈ విషయమై ఏఎస్ఐ భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ ఫిర్యాదు ఇచ్చినమాట వాస్తవేమనని, బాధితులతో పూర్తిగా చర్చించి కేసునమోదు చేస్తామన్నారు.

ప్రశ్నించే గొంతులు నొక్కడం తగదు

● శాంతియుత నిరసనలు చేస్తే అక్రమ కేసులా..? ● భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి
● సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ నేతలు

ములకలచెరువు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలపై ప్రశ్నించే గొంతులను నొక్కడం తగదని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పోలీసుల నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ప్రతిపక్ష, ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు సరిపడా ఎరువులను సక్రమంగా సరఫరా చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని మదనపల్లెలో శాంతియుతంగా నిరసన తెలిపారన్నారు. దీంతో కమ్యూనిస్టు నేతలపై అక్రమ కేసులు బనాయించి ప్రశ్నించే గొంతులు నొక్కాలని చూడడం ప్రభుత్వానికి తగదని హితవు పలికారు. యూరియా అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ఒక్క అన్నమయ్య జిల్లాలో మాత్రమే కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అప్పటి కలెక్టర్, ఎస్పీ రాష్ట్ర ప్రభుత్వ మెప్పు కోసం అక్రమ కేసులు బనాయించారన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు రఘునాద్, తంబయ్యశెట్టి, అష్రఫ్‌అలీ, నిజాముద్దీన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు హైదర్‌వలి, బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దపాళ్యం సోమశేఖర్, బాస్ సీనియర్ జిల్లా నేతలు మంత్రాల రమణ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు హరికుమార్, ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు తరుణ్, పద్మావతి, శంకరమ్మ, ఎల్లప్ప, రమణ, రెడ్డెప్ప, సుబ్బన్న, ఉత్తన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి

డాక్టర్లు కాదన్నారు - 108 పురుడు పోసింది

వైద్యుల నిర్లక్ష్యం... ● అంబులెన్స్‌లోనే ప్రసవం ● పది నిమిషాల్లోనే తిరుపతికి రెఫర్


అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి పురుడూ ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరగాలని, అత్యవసరమైతే తప్ప బయటికి రెఫర్ చేయరాదని ఉన్నతాధికారులు పదే పదే హెచ్చరిస్తున్నారు. అయితే అర్ధరాత్రి ప్రసవ వేదనతో వచ్చిన మహిళను పది నిముషాలు పరిశీలించి వెంటనే కాన్పు కష్టమని తేల్చి తిరుపతికి రెఫర్ చేశారు. అయితే డాక్టర్లకు చేతకాని ప్రసవాన్ని 108 సిబ్బంది చేసి తాము ఎవరికీ తీసిపోమని నిరూపించారు. ఇది వంద శాతం డాక్టర్ల నిర్లక్ష్యమేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకెళితే....

మదనపల్లె మండలం, బసినికొండ వాసి భాగ్యమ్మ ఆదివారం అర్ధరాత్రి ప్రసవ వేదనతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 ద్వారా మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు పదినిమిషాలు పరీక్షించి మదనపల్లెలో ప్రసవం కష్టమని తిరుపతికి రెఫర్ చేశారు. దీంతో ఎంతో ఆవేదనతో గర్భిణి కుటుంబీకులు ఆమెను 108లో తీసుకుని రుయాకు బయలుదేరారు. కాగా గర్భిణి మార్గమధ్యలో భాకరాపేట వద్ద సాధారణ ప్రసవంగానే సురక్షితంగా మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. మదనపల్లె ఆస్పత్రి డాక్టర్లు మామూలుగా రెఫర్ చేయడం పరిపాటైంది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ల నిర్లక్ష్యానికి నిదర్శనం.

సీనియర్ సిటిజన్ సంక్షేమానికి కమిటీ వేయాలి

రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మునిగోపాల కృష్ణ

మదనపల్లె, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి కమిటీ వేయవాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మునిగోపాల కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక జీఆర్‌టీ హైస్కూల్‌లో ఆదివారం సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారం, వారి సంక్షేమానికి కమిటీ ఏర్పాటు, ప్రత్యేకంగా మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని సూచించారు. వయోవృద్ధులపై వేధింపుల నివారణకు 2007లో తీసుకొచ్చిన చట్టాన్ని పక్కాగా, పకడ్బందీగా అమలు చేయాలని, ఆ బాధ్యతను కలెక్టర్లకు అప్పటించాలని స్పష్టం చేశారు. వయోవృద్ధులకు ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో, ఆర్టీసీలో 25శాతం ఉన్నట్లు రైల్వేలో కూడా ఉన్న ఈ అవకాశాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు. సీనియర్ సిటిజన్ గొల్లపూడి మారుతీరావుకు సేవా అవార్డు వచ్చినందుకు సన్మానించారు. సంఘం నేతలు జగన్‌మోహన్, ఉస్మాన్ సాహెబ్, ఎస్.ఎం.నాయుడు, మహిళా ప్రతినిధులు సరస్వతమ్మ, ఎస్.ధనలక్ష్మి, టి.ఎస్.ఎం.కృష్ణమూర్తి, శ్రీనివాసులు, కృష్ణకుమార్, ప్రసాద్, భవానీప్రసాద్ పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాఘవరెడ్డి

వాల్మీకిపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విధుల్లో పోలీసు అధికారులు, సిబ్బంది ఏమాత్రం నిర్లక్ష్యం వహించక అప్రమత్తంగా ఉండాలని, వాల్మీకిపురం సీఐ రాఘవరెడ్డి సూచించారు. ఆదివారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలం పెండింగ్ కేసులపై దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లో నిత్యం వాహనాల తనిఖీ చేపట్టాలని, అక్రమ రవాణ పట్ల చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యతగా పోలీసులు విధులు నిర్వహిస్తేనే ప్రజలకు భద్రత, భరోసా కల్పించినవారవుతామన్నారు. స్టేషన్లకు వచ్చే ఫిర్యాది దారులు, మహిళల పట్ల మర్యాద పూర్వకంగా మెలుగుతూ సమస్యలు పరిష్కరించాలన్నారు. నాటుసారా, అక్రమ మద్యం, బెల్ట్‌దుకాణాలు, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాల్లో ఏమాత్రం ఉపేక్షించరాదని, సమాచారం అందిన తక్షణమే చర్యలు చేపట్టి కేసులు నమోదు చేయాలని వివరించారు. సమావేశంలో ఎస్ఐలు చంద్రశేఖర్, రఘురాం, ఏఎస్ఐ గోపాల్‌నాయక్, సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కొత్త ఈ-పోస్ మెషిన్ల పంపిణీ

పీలేరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త ఈ-పోస్ మెషిన్లను డీలర్లకు మంగళవారం పంపిణీ చేయనున్నట్లు పీలేరు సీఎస్ డీటీ విజయ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి కొత్త మెషిన్లను అందజేస్తామన్నారు. పీలేరు, కలికిరి, కంభంవారిపల్లె, కలకడ మండలాల్లోని చౌకదుకాణ డీలర్లు విధిగా హాజరై కొత్త మెషిన్లు తీసుకోవాలన్నారు. డీలర్లందరూ తమ వద్ద ఉన్న పాత మెషిన్లు, వాటి చార్జర్లు, యాంటీనా, సిమ్ కార్డును తీసుకురావాలన్నారు. మండలంలో 56, కలికిరి మండలంలో 34, కంభంవారిపల్లె మండలంలో 52, కలకడ మండలంలో 32 చౌకదుకాణాలకు కొత్త మెషిన్లు అందజేయనున్నట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

పేరుమార్చారు.. జారుకున్నారు

రెంటికీచెడ్డ రేవడిలా బి.కొత్తకోట ● పాలకవర్గం లేక... నిధులు రాక కుదేలు

సమస్య పరిష్కారంపై కొరవడిన చిత్తశుద్ధి ● ఈ..గ్రహణం వీడేదెప్పుడు?


బస్‌షెల్టర్ లేక నడిరోడ్డుపై నిలుచున్న విద్యార్థులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాలను సైతం అభివృద్ధి చేస్తామని ప్రకటించిన వైసీపీ ప్రభుత్వం కొన్ని పనులను అట్టహాసంగా చేపట్టి గాలికొదిలేశారు. బి.కొత్తకోట మేజర్ పంచాయతీ పేరు మార్చి ప్రజలను ఏమార్చి భరించలేని భారం మోపారు. ఏ అర్హతలతో మార్చు చేశారంటూ ఎదురైన సవాల్‌కు జవాబివ్వడంలో వైసీపీ ప్రభుత్వానికి చేతకాకపోయింది. ఫలితంగా చిత్తశుద్ధి కొరవడడంతో ఐదేళ్లగా పెద్దలు లేని అనాధగా మిగిలింది నగరపంచాయతీగా మార్పు తప్ప ఒరిగిందేమీ లేదని తిరిగి మేజర్ పంచాయతీగా కొనసాగించాలని నిరసనలూ జరిగాయి. పాలకవర్గం ఏర్పాటు కాక, రావాల్సిన నిధులు రాక అభివృద్ధి ఊసే లేకుండాపోయింది. నగర పంచాయతీ స్థాయిలో సౌకర్యాలు లేకున్నా పన్నులు మాత్రం పెరగడంపై జనం విరుచుకుపడుతున్నారు. రెంటికీచెడ్డ రేవడిలా మారిన పట్టణ సమస్యను పరిష్కరించడంలో ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

2021లో వైసీపీ ప్రభుత్వం బి.కొత్తకోటను నగర పంచాయతీగా మారుస్తూ జీఓ తెచ్చారు. పట్టణానికి నగర పంచాయతీగా మార్చేస్థాయిలో సౌకర్యాలు లేవని, వైసీపీ స్వార్థంతో తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కోర్టుకేసు నమోదైంది. దానిని దీటుగా ఎదుర్కొనే సత్తాలేక పోవడంతో ఎన్నికలు జరగ, పాలకవర్గం ఏర్పడక పోవడంతో పరిపాలన కుంటుపడింది. జీఓ వచ్చి ఈ డిసెంబరుకు ఐదేళ్లు పూర్తైనా సమస్య పరిష్కారం కాలేదు. చిత్తశుద్ధి లేకపోవడంతో పుణ్యకాలం కాస్తా పూర్తి అయింది.

లోటుబడ్జెట్‌తో...

ఏకపక్షంగా స్థాయిని పెంచిన వైసీపీ పాలకులు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించలేక పోయారు. పంచాయతీగా ఉన్నప్పుడు మంజూరైన ఐదు సచివాలయ భవనాలను పురపాలకశాఖ పరిధిలోకి చేర్చలేకపోయారు. రెగ్యులర్ ఉద్యోగుల నియామకం చేపట్ట లేకపోయారు. పాలకవర్గం లేక కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా అందడం లేదు. 'అమృత్ 2.0' కింద రూ.9.90 కోట్లు మంజూరైనా వాటిని వినియోగించుకోలేక పోయారు. 15వ ఆర్థికసంఘం నిధులు రూ. కోటి వరకు మురిగి పోయాయి. వార్షిక ఆదాయం రూ.213.31 లక్షలు కాగా, ఖర్చు అంతకు మించి వుండడంతో లోటు బడ్జెట్‌తో నగరపంచాయతీ కుదేలవుతోంది. కొత్త గా అభివృద్ధి పనుల సంగతి అటుంచి జీతభ త్యాలకే కష్ట తరంగా మారింది.

నిధులు వస్తే అభివృద్ధి సాధ్యమే...



ప్రస్తుతం నగరపంచాయతీలో నిధుల కొరత వుంది. పట్టణంలో రూ.15కోటకు పైగా బకాయిలున్నాయి. మెగా డ్రైనేజీ సహా వివిధ పనులకోసం రూ.30 కోట్లకు ప్రతిపాదనలు పంపాము. అందుబాటులో ఉన్న నిధులతో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం లాంటి మౌలిక వసతులు కల్పిస్తున్నాం. పాలకవర్గం ఏర్పాటైతే నిధులు పెరుగుతాయి.

- జీవీ పల్లవి, కమిషనర్, నగరపంచాయతీ

వైసీపీ ఏకపక్ష నిర్ణయాన్ని సవాల్ చేశాను



ప్రజాభిప్రాయంతో పనిలేకుండా, ఏ అర్హతలు లేకున్నా బి.కొత్తకోటను నగర పంచాయతీగా మార్చడాన్ని సవాల్ చేస్తూహైకోర్టులో కేసువేశాను. స్వార్థం తప్ప అభివృద్ధి చేయాలనే తపన ఉంటే బి.కొత్తకోట కంటే అన్ని వసతులున్న పీలేరును ఎందుకు చేయలేదు. కేసు ఉపసంహరణ చేసుకోవాలని పలుమార్లు విజ్ఞాపనలు, వత్తిళ్లు వచ్చాయి. పట్టణ అభివృద్ధికి ముఖ్యనేతల హామీ ఇస్తే కేసు విషయం ఆలోచిస్తాం

- చిట్టా రామక్రిష్ణారెడ్డి, ఫిర్యాది దారుడు, బి.కొత్తకోట

పన్నులు జాస్తి.. సౌకర్యాలు నాస్తి

నగర పంచాయతీగా మార్పుతో భూముల రిజిస్ట్రేషన్ చార్జిలు, ఇంటిపన్నులు, వీఎల్‌టీ, నీటి పన్ను అమాంతం పెరిగిపోవడంతో సామాన్యులు కట్టలేక లబోదిబోమంటున్నారు. రంగ సముద్రం రోడ్డు, బెంగళూరు రోడ్డు, మదనపల్లె రోడ్డు ఆక్రమణకు గురై కుచించుకు పోయాయి. ప్రధానరోడ్లలో డ్రైనేజీ నిర్మాణం, బెంగళూరు రోడ్డు డివైడర్ నిర్మాణానికి నోచుకోకుండా పోయాయి. పంచాయతీగా ఉన్నపుడు(2019-20)లో పట్టణ ప్రజలు ఆస్తిప న్ను రూ. 65లక్షలు చెల్లిస్తే, స్థాయి పెంపుతో అది కాస్తా రూ. 1.40కోట్లకు పెరిగింది. పార్కు, విశాల మైన రోడ్లు, డ్రైనేజీ, జంతువధశాల లాంటి సౌక ర్యాలు లేకపోగా పన్నులభారం భరించాల్సి వస్తోంది.


పట్టణంలోని జ్యోతిసర్కిల్


ఆక్రమణలతో కుచించుకుపోయిన మెయిన్‌బజారు

ఎమ్మెల్యే హామీకి మోక్షం లేదా ?

గోతులు, గుంతలతో మదనపల్లె- నిమ్మనపల్లె రోడ్డు


నిమ్మనపల్లె రోడ్డు బసినికొండ సమీపంలో రోడ్డుపై పారుతున్న నీళ్లు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే షాజహాన్ బాష హామీకి ఇప్పటికైనా మోక్షం లభించినట్లు లేదు. మదనపల్లె- నిమ్మనపల్లెకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు. నిమ్మనపల్లె రోడ్డు మార్గం కలగానే మిగిలిపోతోంది. ఏళ్ల తరబడి మాటలు చెబుతున్నారే తప్ప నిమ్మనపల్లె డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం పూనుకోవడం లేదన్నారు. మదనపల్లె - నిమ్మనపల్లె డబుల్ రోడ్డు ప్రజలకు అందని దాక్షగా మిగిలిపోయింది. డబుల్ రోడ్డు ఏర్పాటైతే వాహన దారుల సమస్యలు తీరుతాయని అనుకుంటున్నారు. మదనపల్లె- నిమ్మనపల్లె డబుల్ రోడ్డు ఏర్పాటు కాక పోయినా కనీసం ఉన్న రోడ్డుకు మర్మతులు చేయడం, గోతులకు కనీసం పాచ్ వర్క్ అయినా చేయాలని కోరుతున్నారు. ఈ రోడ్డులో వాహనదారులు, స్కూల్ బస్సులు ప్రయాణం కష్టతరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మెత్తం గోతులు మరింత పెద్దవయ్యాయి. మదనపల్లె నుంచి నిమ్మనపల్లెకు వెళ్లే రోడ్డు మార్గంలో బసినికొండ వద్ద రోడ్డుపై నీళ్లు పారుతూ కాల్వను తలపిస్తోంది. గంగన్నగారిపల్లె, రామాచార్లపల్లె సమీపంలో, ఆర్యవైశ్య వృద్ధాశ్రమం వద్ద, వశిష్ట స్కూల్ సమీపంలో గుంతలు అధికంగా ఏర్పడ్డాయి. సింగిల్ రోడ్డు కావడం అందులోనూ వాహనాల రాకపోకలు అధికంగా ఉండడం, గుంతలు ఏర్పడిన రోడ్డుపై ప్రయాణం చేయడం సాహసోపేతంగా మారింది. రాత్రిళ్లు గుంతలు కానరాక ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ చూపి మదనపల్లె - నిమ్మనపల్లె డబుల్ రోడ్డు వేయడానికి కృషి చేయాలన్నారు. ఇప్పటికే మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాష పలు మార్లు హామీ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు.

కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణాచారికి సన్మానం


బంగారు రామకృష్ణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం డైరెక్టర్, టీడీపీ సీనియర్ నేత, ఆర్.కె.జ్యువెలర్స్ అధినేత పి.రామకృష్ణా చారిని కూటమి నేతలు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం రామకృష్ణను డైరెక్టర్‌గా ప్రకటించడంతో పట్టణంలో సన్మానం చేసి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈయన సతీమణి పి.తులసి మూడుసార్లు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం 20 వార్డు కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాష, జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరి, గాజుల శివరామ్‌ప్రతాప్, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం, జి.నవీన్‌చౌదరి, టీడీపీ నేతలు ఎస్.ఎ.మస్తాన్,హజ్‌కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, బాలుస్వామి, ఎన్.బాబునాయుడు, షంషీర్, ఎస్.సుధాకర్, నాగయ్య, రెడ్డెప్పరావు, 20వార్డులోని ప్రజలు, కూటమి నేతలు సన్మాంచారు.

● రూ.2.61కోట్ల పనులకు భూమి పూజలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణం సహా మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాష విస్తృతంగా పర్యటించారు. కోమటివానిచెరువు, రామ్‌నగర్‌పార్కు, తట్టివారిపల్లె, టీకేపల్లె, ప్రాంతాల్లో రూ.2.61కోట్లతో రూపొందించిన అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం 12 మందికి సీఎం చంద్రబాబు మంజూరు చేసిన రూ.9.5లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

పేదలకు అన్నదానం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక అమ్మినేని వీధి రోడ్డులో ఆదివారం పేదలకు టీడీపీ నేత జోలెపాలెం దేవేంద్ర (చిన్నా) ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. తన తమ్ముడు భరత్‌కుమార్ (భాచీ) వర్ధంతి సందర్భంగా అన్నదానంలో ఎమ్మెల్యే షాజహాన్ బాష టీడీపీ నేతలతో కలిసి పాల్గొన్నారు. టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భవానీ ప్రసాద్, రాటకొండ రంగస్వామి నాయుడు, సిమెంట్ రమణ, రైస్‌మిల్ శశికుమార్, బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్, మిత్రులు సాయిశేఖర్‌రెడ్డి, రెడ్డిప్రసాద్, మున్నా, ధీరజ్, రాజు, రవి, భాస్కర్, దర్శన్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

పెంచుపాడుకు రోడ్డు వేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషకు గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద ప్రజా సమస్యల పరిష్కారంలో మదనపల్లె మండలం, పెంచుపాడుకు చెందిన గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి విన్నవిస్తే పరిశీలించి రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

తాగు నీటి సమస్య పరిష్కరించండి


వెలికి తీసిన పైపులు, మోటారు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దాదంవడ్డిపల్లెలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సుమారు 100 కుటుంబాలు జీవనం సాగి స్తున్న గ్రామంలో ఉన్న నీటి బోరు సుమారు 15 రోజుల కిందట మరమ్మ తులకు గురైంది. అప్పటినుంచి చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ పొలాల బోర్ల నుంచి ఇబ్బందులు పడుతూ నీటిని తెచ్చుకుంటున్నట్లు గ్రామస్తులు వాపోయారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులకు తెలపడంతో వారం కిందట బోరు నుంచి పైపులు, మోటారును వెలికి తీసి రిపేరి చేసేం దుకు తీసుకెళ్లారని, మళ్లీ అమర్చలేదని వాపోయారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు కార్పెంటర్‌కు గాయం


చికిత్స పొందుతున్న చంద్ర

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రకాలనీ వాసి చంద్ర ప్రమాదవశాత్తు గాయపడినట్లు అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపారు. ఆదివారం మదనపల్లె పట్టణం, సాయిచిత్ర వెనుకవైపు ఇంట్లో పని చేస్తుండగా చంద్రపై మిషన్ పడగా కాలు తొడవద్ద, మెడిమపై గాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

అలంకార ప్రాయంగా హైమాస్ట్ దీపాలు


వెలగని విద్యుత్ దీపాలు

కలకడ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఉన్న హైమాస్ట్ విద్యుత్ దీపాలు అలంకారప్రాయంగా మారాయి. పుష్కర కాలం కిందట రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నేషనల్ హైవేస్ అధికారులు టవర్ నిర్మించి దానికి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారు. అయితే కొద్ది రోజులు మాత్రమే ఈ లైట్లు వెలిగి తరువాత కొన్నాళ్లకు కాంతులు ఆగాయి. ఏళ్లు గడుస్తున్నా వీటి నిర్వహణ గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. పరిస్థితితో రాత్రి వేళల్లో కూడలి ప్రాంతంలో చీకట్లు అలముకుంటున్నాయి. కారణంగా వృద్ధులు, ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

'సమష్టి పోరాటాలతోనే సమస్యల పరిష్కారం'

రాయచోటిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమష్టి పోరాటాలతోనే రాష్ట్రంలో కురుబల సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షుడు, షెపర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ ఏపీ అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, అధ్యక్షుడు, న్యాయవాది కే. రవిశంకర్ తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన ఏపీ కురమ, కురబ, కురవ సంక్షేమ సంఘం 10వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా అక్టోబరు 12న విజయవాడలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో జరగనున్న వార్షికోత్సవాల పోస్టర్లను ఆదివారం రాయచోటిలోని అజయ్ రెసిడెన్సీలో విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కులస్తులు అందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత


ఎన్‌సీసీ క్యాడెట్లతో కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్, తదితరులు

కురబలకోట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): డీమ్డ్ టు బి మిట్స్ యూనివర్శిటీ ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లు అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో 35 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులకు 'బి', 'సి' సర్టిఫికెట్లకు పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీల్లో 'బి' సర్టిఫికెట్లకు 45మంది హాజరవగా ఏ గ్రేడ్‌లో ఆరుగురు, బి గ్రేడ్‌లో 39 ఉత్తీర్ణత సాధించారు. 'సి' సర్టిఫికెట్లకు 29మంది హాజరవగా ఏ గ్రేడ్‌లో 26మంది, బి గ్రేడ్‌లో ముగ్గురు ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభావంతులకు సర్టిఫికెట్లను ఏఓ లోకనాథమ్, కమాండిగ్ ఆఫీసర్ మోనీష్, తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సీతీంధర్ దహియా, వీసీ యువరాజ్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ త్రివిధ దళాల్లో ఉద్యోగవకాశాలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి.ఎన్, కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ నవీన్ కుమార్ తదితరులు అభినందించారు.

అన్నదాన ట్రస్టుకు రూ.1.7లక్షలు విరాళం

తంబళ్లపల్లె, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి సేవా సమితి అన్నదాన ట్రస్టుకు ఓ దాత రూ.1.7 లక్షలు విరాళంగా అందచేశారు. కురబలకోట మండలం రామిగానిపల్లెకు చెందిన సొగసాని రెడ్డప్ప రెడ్డి కుమారుడు బయ్యారెడ్డి, అంజనా దేవి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి అన్నదాన ట్రస్టు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి, ట్రస్టు సభ్యులకు రూ.1.7లక్షల చెక్కును శనివారం అందచేశారు. దాతలు మాట్లాడుతూ మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి దర్శనార్థం కొండకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ట్రస్టు అభివృద్ధిలో పాలు పంచుకోవడం తమ అదృష్టమన్నారు. అన్నదాన ట్రస్టు సభ్యులు దాతల దాతృత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో అన్నదాన ట్రస్టు సభ్యులు సుధాకర్‌రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన ట్రస్టు సభ్యులకు చెక్కును అందచేస్తున్న దాతలు